క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

తెనాలిరూరల్: తెనాలి డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వినియోగదారుల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెనాలి విద్యుత్ ఈఈ వీవీ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని విద్యుత్ డీఈఈ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలి విద్యుత్ డీఈఈ పరిధిలోని అన్ని గ్రామాలు, పట్టణాల విద్యుత్ వినియోగదారులు సమావేశంలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. సమావేశంలో తమ దృష్టికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

గురుపౌర్ణమి వేడుకల్లో కోదండ రాముడికి పూజలు



తెనాలి : పట్టణ మారీస్‌పేటలోని శ్రీ కోదండరామ స్వామి (అప్పలస్వామి గుడి) ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం ఆలయ ప్రధాన మూర్తులైన శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబాకు గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం పంచామృతం, పళ్ల రసాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలియజేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు. ధర్మకర్తలు కొనపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, లంక శివఆంజనేయ ప్రసాద్, అర్చకులు దినమని ధనుష్, సుబ్రహ్మణ్య శర్మ పర్యవేక్షణలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

పాడి రైతుల సమస్యలపై వినతి



తెనాలి: రైతు సమస్యలు, పాడి రైతుల సమస్యలపై శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఒకటో సచివాలయం వీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి సహా పలువురు రైతులు, మహిళా రైతులు పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు. పాల రైతు సంఘం నాయకురాలు వేజెండ్ల తబిత మాట్లాడుతూ పాడి-పంట ఒకటి దెబ్బతింటే మరొకటి ఆదుకుంటుందనే ఉద్దేశంతో కౌలు రైతుల కుటుంబాలు వ్యవసాయం, పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నట్టు చెప్పారు. గత సంవత్సరం నష్ట పోయిన తెల్లజొన్నల పరిహారాన్ని ఇప్పించాలనీ, పశు పోషణకు సబ్సిడీతో కూడిన రుణం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. తెనాలి ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్తోట కమలమ్మ, మేకల ధనమ్మ, తెనాలి శాంతకుమారి, చుండూరు మార్తమ్మ, మాన్యం శ్యాంబాబు, ఎల్లమాటి మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విజయ్ పికిల్స్, బిట్రా సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్‌పాస్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి బస్‌పాస్‌కు చెల్లించాల్సిన రూ.60 దాతలు 250 మంది విద్యార్థులు చెల్లించి ఉచితంగా అందజేశారని తెలిపారు. విజయ పికిల్స్ యజమాని కాట్రు రాము, బస్‌స్టేషన్ డెప్యూటీ సూపరింటెండెంట్ నాయక్‌లు విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించారని అన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని, విద్యార్థులు హైస్కూల్‌కు వచ్చేటప్పుడు వారికి ప్రయాణ భారం పడకూడదని ప్రభుత్వ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. విద్యార్థులు పాస్‌లకు చెల్లించాల్సిన నగదును దాతలు చెల్లించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఎస్.రవి, ఆర్టీసీ సిబ్బంది జీవీఎస్, మన్యం, కొండవీటి శ్రీధర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మద్యానికి బానిసై శానిటైజర్ తాగి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శివనాగరాజుకాలనీలో నివాసం ఉండే కె.రాజు(35) భార్య వదిలి వెళ్లడంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు లేక శానిటైజర్ తాగడం అలవాటు చేసుకున్నారు. ఎక్కువ మొత్తంలో శానిటైజర్ తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు రాజును రెండు రోజుల క్రితం జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన మాగాణి చేలు

- వెదజల్లిన చేలల్లో రైతులకు భారీ నష్టం
- ఉచిత వరి విత్తనాలు, రూ.10 వేలు ఆర్థిక సాయం అందివ్వాలని ఏపీ రైతు సంఘం డిమాండ్



తెనాలి సమీపంలో నీట మునిగిన చేలను పరిశీలిస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి: గత అయిదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయని, ఫలితంగా రైతులు ఎకరాకు రూ.10 వేలు నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. పట్టణ అయితానగర్‌తో పాటు, సమీపంలోని రూరల్ మండల గ్రామాలైన నేలపాడు, కంచర్లపాలెం గ్రామాల్లోని పంట పొలాలను శుక్రవారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఖరీఫ్ సీజను ఆరంభమైన దృష్ట్యా మాగాణి చేలల్లో వరి విత్తనాలను చల్లారు. ప్రస్తుతం ఆయా చేలల్లో వర్షపు నీరు భారీగా నిలిచినందున వేసిన విత్తనాలతో సహా కూలి ఖర్చులు కలిపి మొత్తం రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు నష్టం వాటిల్లినట్టు కౌలురైతు వేజెండ్ల నాగేశ్వరరావు చెప్పారు. పంటకాల్వలు, మురుగు కాల్వలు సకాలంలో మరమ్మతులు చేయని కారణంగానే రైతులు నష్టపోవాల్సి వచ్చిందని శివసాంబిరెడ్డి అన్నారు. వరి విత్తనాలు వెదపట్టిన చేలల్లో నీరు నిలిచి, నష్టపోయిన రైతులకు వరి విత్తనాలను ఉచితంగా అందించాలని, నష్ట పరిహారంగా రూ.10 వేలు అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీరితో బండి సుధాకర్, మత్తే మోషే, పాములయ్య, మరియదాసు, విల్సన్, బాలస్వామి తదితరులున్నారు.

వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్
- సమస్యలు పరిష్కారం కాకుంటే జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ముట్టడికి కార్యాచరణ



మాట్లాడుతున్న పాశం వెంకటేష్

తెనాలి: రాష్ట్ర వ్యాప్తంగా గల సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గత ఏడేళ్లుగా ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తి స్థాయిలో ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. 2023వ సంవత్సరం నవంబర్ నెల నుంచి మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల కానందున, హాస్టల్ వార్డెన్లు విద్యార్థులకు నాణ్యమైన సరుకులతో కూడిన భోజనాన్ని అందించలేక పోతున్నారని విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు గండు శివనాగరాజు మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలలో పీజీ చదివే విద్యార్థుల చదువులకు జీవో నెంబర్ 77 ఆటకంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యవగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే జీవో నెం.77ను రద్దు చేయాలని కోరారు. తెనాలిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈ నెల 20 వ తేదీ నుంచి 30 వరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తామని వెల్లడించారు. వీరితో సాయి, పి.భూమేష్, కె తేజ, మద్దినేని కిరణ్ బాబు పాల్గొన్నారు.

డయేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బాల చంద్రమౌళి

తెనాలి: పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల ఆదేశాలపై శుక్రవారం స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో డయేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కప్పల రాజారెడ్డి అధ్యక్షత వహించారు. డయేరియా వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. చేతులు ఎందుకు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ఎలా పరిశుభ్రం చేసుకోవాలి.. అనే అంశాలపై ఇన్‌చార్జి హెల్త్ విజిటర్ విజయకుమారి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కీటక జనిత డెంగీ వ్యాధి వ్యాప్తి నివారణ చర్యల గురించి ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి వివరించారు. ఇంటిలో, ఇంటి ముందు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వారానికోసారి నిల్వ ఉన్న నీటిని పారబోయాలనీ, నిల్వ ఉన్న నీటిలో మడ్డి ఆయిల్ లేదా వాడిన వంట నూనెను గానీ వేసినట్టయితే దోమల లార్వా వ్యాప్తి చెందకుండా నిర్వీర్యమవుతుందని చెప్పారు. దోమ జీవిత చక్రంలో నాలుగు దశలు ఉంటాయని, గుడ్డు, లార్వా దశలో నిర్వీర్యం చేస్తే దోమల సంతతి పెరగకుండా ఉంటుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జమ్ముల రమేష్, స్టాఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండూరి శ్రీనివాసరావు, రికార్డ్ అసిస్టెంట్ గాలి సునీల్, సచివాలయ హెల్త్ సెక్రటరీ మద్దాల అనిత, ఆశా కార్యకర్త మందనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ తొలగింపు



నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసే వెంచర్లు, లే అవుట్స్‌ని తొలగిస్తామని, ప్రజలు అనుమతి పొందిన వెంచర్లలోనే స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్ లో సమస్యలు రాకుండా ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధిలోని నల్లపాడు రోడ్‌లోని ఆదర్శ నగర్ ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్ హద్దు రాళ్లు, మార్కింగ్, రోడ్లను పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీలులేదని, ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్‌కి వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీచ్ టూల్ శిక్షణ



ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ

తెనాలి: విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'టీచ్ టూల్' శిక్షణ తరగతులు తెనాలిలో రెండవ రోజైన బుధవారం కొనసాగింది. స్థానిక కొత్తపేటలోని సెయింట్ జాన్సన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో థర్డ్ స్పెల్ శిక్షణ కార్యక్రమం పది రోజుల పాటు జరుగుతుంది. రెండో రోజు శిక్షణలో తెనాలి డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అడిషినల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి సందర్శించారు. తరగతి గది సంస్కృతి, సహాయ అభ్యసన వాతావరణం, ప్రవర్తన నాణ్యతా పరిధి తదితర అంశాలను శిక్షణ ద్వారా తెలియజేశారు. ఇందుకు సంబంధించి వీడియో ప్రజంటేషన్ ద్వారా అబ్జర్వేషన్ షీట్ స్కోర్ చేశారు. లీడర్ ఫర్ ఈక్విటీ, విజయవాడ నుంచి అబ్జర్వర్లుగా శిల్ప, నేత్ర, చెంచు, రిషబ్‌లు హాజరయ్యారు. టీచ్ టూల్ శిక్షణను పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు, టీచర్ మెంటార్స్ పి.పద్మ, యు.ప్రసాద్, జీవీ బాలసుందర్, ఎం అభిగయల్, ఎన్.విజయలక్ష్మి, కె.శ్రీమన్నారాయణ, కె.పద్మావతి, బీహెచ్ శ్రీధర్, జె ప్రకాశరావు, ఎస్ఏఎల్‌టీ కోఆర్డినేటర్ వీరయ్య పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి కృషి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

నగరంపాలెం: జిల్లాలో విధులు నిర్వర్తించే పోలీస్ అధికార, సిబ్బంది పలు సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)నకు వస్తారని, వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మినిస్టీరియల్ సిబ్బందికి సూచించారు. ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను శుక్రవారం డీపీఓలోని ఏ సెక్షన్, బీ సెక్షన్, సీ సెక్షన్ ఏఓ, సూపరింటెండెంట్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికార, సిబ్బంది సంక్షేమం కోసం ఐక్యతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఏఓ వేంకటేశ్వరరావు, హిమవంతరావు, శంకరరావు, సందాని బాషా, షరీఫ్, బాషా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

తప్పిపోయిన బాలుడు..



గుంటూరు ఈస్ట్: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని కొత్తపేట పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు బాలుడిని అప్పగించారు. శుక్రవారం తొమ్మిది సంవత్సరాల వయస్సు ఉన్న షేక్ అబ్దుల్ బాసిత్ జీజీహెచ్‌లో ఒంటరిగా తిరుగుతున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని కొత్తపేట పోలీసులకు అప్పగించారు. బాలుడు తల్లిపేరు షరీఫా అని, విజయవాడలోని సుందరయ్యకాలనీలో నివాసం ఉంటున్నట్లు చెబుతున్నాడు. అయితే తండ్రి పేరు చెప్పలేకపోయాడు. ఫొటోలోని బాలుడిని గుర్తించిన వారు 8688831320, 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

ఘనంగా బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం



ఏఐబీఈఏ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న కిషోర్‌కుమార్, రామారావు, సయ్యద్ బాషా తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకుల జాతీయకరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందూ కళాశాల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ వద్ద ఏఐబీఈఏ పతాకాన్ని ఇండియన్ బ్యాంక్ ఉద్యోగ సంఘ నాయకుడు రామారావు ఆవిష్కరించారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సలహాదారు పి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 1969 జూలై 19న నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 14 బ్యాంకులను జాతీయం చేసినట్లు చెప్పారు. భారత దేశ చరిత్రలో ఇదొక ప్రధాన ఘట్టమన్నారు. బ్యాంకింగ్ సౌకర్యాలు పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిందని చెప్పారు. కానీ 1991 తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటుబ్యాంక్‌లను సమర్థిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకులలో రాజకీయ జోక్యంతో నిరర్థక ఆస్తులు విపరీతంగా పెరగడం ఈ పది సంవత్సరాలలో రూ.లక్షల కోట్లు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు వ్యవసాయ రుణాల మాఫీ అడుగుతుంటే కార్పొరేట్ రుణాల మాఫీ ప్రభుత్వం చేపడుతోందని విమర్శించారు. ఈ రోజు భారతదేశంలోని బ్యాంకులలో ఉన్న రూ.225 లక్షల కోట్లు ప్రజాధనం సురక్షితంగా ఉండాలంటే బ్యాంకులన్నీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రుణ ఎగవేతదారులైన బడా పెట్టుబడీ వర్గాల మీద క్రిమినల్ కేసులు పెట్టి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. సామాన్యులు పొదుపు చేసుకొనే సేవింగ్స్ బ్యాంకు అకౌంట్స్‌కు ఇచ్చే వడ్డీ రేట్లు పెంచాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తీసుకొనే ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఏఐబీఈఏ ద్వారా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషా, యూనియన్ నాయకులు మురళి, రవీంద్రారెడ్డి, శివాజీ, షరీఫ్, క్రాంతి, పావని, పృథ్వీ, రామకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

ఎక్సరే సెంటర్‌లో చోరీ



గుంటూరు ఈస్ట్: ఎక్సరే సెంటర్‌లో చోరీ ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కొత్తపేటలోని న్యూ భారతీ ఎక్సరే సెంటర్‌లో గురువారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం ఎక్సరే సెంటర్ నిర్వాహకుడు నాగభూషణం తలుపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా రూ.10.30 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్, ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడిగోపుల మృతికి సంతాపం

నగరంపాలెం: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారు అడిగోపుల వెంకటరత్నం మృతికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తిరుపతిలో తుదిశ్వాస విడిచినట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య రంగంలో తనదైన సంతకంతో అశేష కృషి చేశారని, అడిగోపుల లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. సంఘం ప్రారంభం నుంచి గౌరవ సలహాదారుగా ఉంటూ సలహాలు, సూచనలతో తనదైన సేవలను అందించడం మరువలేనిదని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

- మూడు కిలోలు స్వాధీనం
- నిర్మానుష్య ప్రాంతాల్లో నిల్వ
- చాకచక్యంగా నిందితులను అరెస్ట్ చేసిన మంగళగిరి టౌన్ పోలీసులు



ముగ్గురు యువకులను అరెస్ట్ చూపిస్తున్న సీఐ వినోద్ కుమార్

తాడేపల్లిరూరల్: గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో విక్రయదారులు తమ రూట్ మార్చి పోలీసుల కళ్లుగప్పి పలు ప్రాంతాల్లో నిల్వచేసి వాటిని పోలీసులు ఏమార్పుగా ఉన్న సమయంలో బయటకు తీసుకువచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమానం వచ్చిన మంగళగిరి టౌన్ పోలీసులు ముగ్గురు యువకులపై నిఘా ఏర్పాటు చేయడంతో నిర్మానుష్య స్థలాల్లో భద్రపరిచిన గంజాయిని బయటకు తీస్తూ ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. మంగళగిరి టౌన్ సీఐ వినోద్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నార్త్ జోన్ డీఎస్పీ సిహెచ్. రవికాంత్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్ యర్రబాలేనికి చెందిన మాకిన అమర్‌నాథ్, కామినేని సాయికృష్ణ, చింతల హరీష్ మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో గంజాయి అమ్ముతున్నారని సమాచారం రావడంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారిని రెండు మూడు సార్లు ఆపి ప్రశ్నించినా వారి వద్ద ఎటువంటి మత్తు పదార్థాలు గాని, సమాచారం గానీ లభించలేదని, వారు తీసుకువచ్చిన గంజాయిని ఎయిమ్స్ హాస్పిటల్ కొండ ప్రాంతంలో భద్రపరిచినట్లు సమాచారం మేరకు వారిని వెంబడించడంతో వారు భద్రపరిచిన గంజాయిని బయటకు తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరు విశాఖపట్నం నుంచి అరకు వెళ్లి అరకులో బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి గంజాయి ఎవరి కంటా పడకుండా మంగళగిరి తీసుకువచ్చి చిన్నచిన్న పొట్లాలుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించినట్లు చెప్పారు.

నేడు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యులపై ధార్మికోపన్యాసం

గుంటూరు ఎడ్యుకేషన్: వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కులపతి డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల జీవితం-విశేషాలు అనే అంశంపై శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ధార్మికోపన్యాసం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా కళాశాల సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు జరగనున్న సభలో ప్రవచనకర్త మల్లాది కైలాసనాథ్, కులపతి ఎ క్కిరాల కృష్ణమాచార్య జీవిత విశేషాలు, గురుపూర్ణిమ విశిష్టతలపై ప్రసంగిస్తారని వివరించారు.

ఈనెల 21న భగవద్గీత ప్రవచనం

నగరంపాలెం: ఈనెల 21న ట్రూత్ స్పిరిటుల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు వివేకానంద గుంటూరు నగరానికి రానున్నారని కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరిటిపాడు లైబ్రరీ సెంటర్‌లోని కొమ్మినేని ఫంక్షన్ హాల్ (కొమ్మినేని గార్డెన్స్)లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భగవద్గీత ప్రవచనం జరుగుతుందని పేర్కొన్నారు.

ముగిసిన శ్రీ మద్భగవద్గీత ధారావాహిక ప్రవచనాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నాలుగు రోజులుగా నిర్వహిస్తోన్న శ్రీ మద్భగవద్గీతలోని అక్షర బ్రహ్మయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలు ముగిశాయి. మాటూరి జగన్మోహనరావు, చెన్నలక్ష్మి దంపతుల సౌజన్యంతో ప్రవచనాలు నిర్వహిస్తుండగా, ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి (చిన్మయ మిషన్) ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునితో సకామకర్మయోగులను క్రమంగా అభిమాన దేవతలు స్వర్గాదిలోకాలకు చేర్చుతారని అన్నారు. శుక్ల, కృష్ణ మార్గాలని, ఈ రెండు మార్గాలు వ్యవహార ప్రసిద్ధి కలదని పేర్కొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

లక్ష్మీపురం: చిరుద్యోగులపై వేధింపులు తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి గెలుపులో రాష్ట్రంలోని కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, చిరుఉద్యోగులకు పాత్ర గణనీయమైందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొంత మంది అంగన్‌వాడీలను 'మీరు రాజీనామాలు చేయమని, అప్పటి వరకు విధుల్లో రావటానికి వీల్లేదని' వేధింపునకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా నోటి మాటగా ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. యానిమేటర్లను తొలగించేందుకు ప్రభుత్వ అధికారులు స్వయంగా పోలీసులను వెంటబెట్టుకొని గ్రామాలకు వెళ్లి డ్వాక్రా మహిళలతో బలవంతంగా సంతకాలు చేయించి యానిమేటర్లను తొలగించినట్లు తీర్మానాలు రాస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలన్నీ చట్టవ్యతిరేకమైనవని, వీటన్నిటిని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మానిఫెస్టోలో కార్మికులు, ఉద్యోగులు, చిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు.

ఈ విషయాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు అందరికీ సీఐటీయూ ఆధ్వర్యంలో విజ్ఞాపన పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. తమ ఉద్యోగాలు, హక్కులు నిలబెట్టుకునేందుకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో చిరుద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ ప్రత్యక్షంగా మద్దతు ఇస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, నగర తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కట్లగుంట శ్రీనివాసరావు, బి. ముత్యాలరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం యాదవపాలెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అల్పాహారం చేసేందుకు ఇంటికి వెళ్లొస్తానని ప్రధానోపాధ్యాయుడి వద్ద అనుమతి తీసుకునేందుకు వెళ్లిన ఐదో తరగతి విద్యార్థినికి అనుమతి నిరాకరించినప్పటికీ, తరగతి గదికి వెళ్లినట్లే వెళ్లిన సదరు విద్యార్థిని ఉపాధ్యాయులకు చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వెళ్లిందని తెలిపారు. పాఠశాల ప్రహరీ దూకి బయటకు వెళ్లిన విద్యార్థిని తలకు గాయం కావడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు పని చేస్తుండగా, అనుకోని ఘటన తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. జరిగిన ఘటనలో ప్రత్యక్షంగా ప్రమేయం లేకున్నప్పటికీ మొత్తం నలుగురు ఉపాధ్యాయులను బాధ్యులని చేసి సస్పెండ్ చేయడంతో ఆత్మస్థైర్యం దెబ్బతిని, నిబ్బరం కోల్పోయారన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులపై సానుభూతితో వ్యవహరించి, సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE TENALI

I.A. NO. 311/2024 IN CR. I.P. NO. 22 / 2024

Pasupuleti Govardhan
...Petitioner/Creditor
Vs
Kandikattu Gangadhara Naga Vara Prasad and another
...Respondents

To
R1 : Kandikattu Gangadhara Naga Vara Prasad, S/o. Veera Swamy, Hindu, aged about 36 years, Employee, R/o. Near Ayyappa Swamy Temple, Kattevaram Road, Balajiraopet, Tenali, Guntur District.
R2: Chintalanka Sai Kumar', W/o. Sambasiva Rao, R/o. D.No. 8-1-10A, Ramalayam Street, Balajirao pet, Tenali , Guntur District.

Take notice that No.1 of you with malafide intention to avoid and delay debt payment to my client P. Govardhan transferred Schedule Property to No.2 ofyou. My client filed above mentioned Cr.I.P. against both of you and also above mentioned I.A. to deliver possession of Schedule Property to the official receiver. The Hon'ble Court is pleased and order issue notice to you by way of this publication. So take notice and file objections if any by the next date of adjournment i.e, on **01-08-2024**

SCHEDULE

Guntur District Tenali West Sub District, Tenali Mandal,Kattevaram Gram D.No. 269/1- Ac.O-48 1/2 cents out of Ac.2-00, Plot No.6, on Eastern side, 66 sq. yards house site R.C.C. daba therein with ground and first floor building bounded by : **East** : 10 ft width of joint Bazar - 25'-0" **South**: Plot No.5 vacant site - 23'-9" **West** : On western side of Plot No. 6 - 25'-0" **North** : 10 ft width of joint Bazar - 23'-9" Within these boundaries an extent of 66.0 sq. yards equivalent to 55.18 sq. mts house site. Door No. 5-485, Ground Floor and First Floor R.C.C. building along with house fittings, electrical meter with meter deposit, electrical fittings and etc., with all easementary rights.

BY ORDER OF THE HON'BLE COURT
Tenali,
Dt. 19-07-2024

K. ISRAEL, Advocate. 9347656053